క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి గురువారం తనిఖీ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లు, సౌకర్యాలు, విద్యుత్, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లపై కమిషనర్, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చలపతిరావు, ఏఈలు రాజశేఖర్, కృపావర్మ బూత్‌లను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పది గడ్డివాములు దగ్ధం

● రూ.10 లక్షల ఆస్తి నష్టం



కాలి బూడిదైన గడ్డివామి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్‌లో గ్రామంలో గురువారం గ్రామ శివారులోని గడ్డివాములకు నిప్పంటుకుని రూ.పది లక్షల ఆస్తి నష్టం జరిగింది. పది మంది రైతులకు చెందిన గడ్డివాములు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యహ్నం 3 గంటల సమయంలో ఒక గడ్డివాముకు మంటలు అంటుకుని క్షణాల్లో వ్యాపించడంతో చుట్టుపక్కల ఉన్న పది గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. కౌతాళం పోలీసులకు సమాచారం తెలుపగా ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని ఆదోని నుంచి రెండు ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను అదుపు చేశారు. అయితే ఆ పాటికే జరగరాని నష్టం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి మహేష్, గ్యాడెకట్టు రామయ్య, దాసరి వీరేష్, మాల మూకప్ప, డ్రైవర్ నర్సప్ప, ఆదోని శాంతప్ప, ఎల్లప్ప, గ్యాడెకట్టు నర్సప్ప, శాంతమూర్తి, గుక్కా వీరేష్, గ్యాడెకట్టు గురుమూర్తిలకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. తమ పశువులకు ఎండాకాలంలో మేత ఎలా అంటూ బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల సిబ్బందికి భోజనం ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి కె.శామ్యూల్

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి భోజనం ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారి కె.శామ్యూల్ వంట నిర్వాహకులను సూచించారు. ఆయన గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10 మండలాల విద్యాధికారులు, ఎంఆర్‌పీ, ఎంఐసీలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లో ఎంత మంది సిబ్బంది పాల్గొంటారో వారందరికీ భోజనం కోసం అయ్యే ఖర్చును వంట నిర్వాహకుల ఖాతాలోకి జమ చేస్తారన్నారు. అవసరమైన సరుకులను కొని ఎన్నికల సిబ్బందికి భోజనం ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు.. భోజనం, వసతి సౌకర్యాల ఏర్పాటులో ఎక్కడా లోటు పాట్లు రాకుండా చూడాలన్నారు. పోలింగ్ ముందురోజు సాయంత్రం స్నాక్స్, టీ, రాత్రి భోజనం, పోలింగ్ రోజు ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం భోజనం సాయంత్రం టీ, స్నాక్స్ అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సరుకులను వినియోగించరాదన్నారు. ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాకు పోటెత్తిన భక్తజనం



ఖాదర్‌లింగ స్వామి సమాధి

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం స్వామి సన్నిధిలో జీలా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన భక్తులు గురువారం కూడా స్వామి దర్శనం కోసం వేచిఉండడంతో పరిసర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. కొందరు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

టీడీపీ హామీలు నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక
● నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపిన రోడ్‌షో



గురజాలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విన్నవిస్తున్న బుట్టా రేణుక

నందవరం: అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడమే టీడీపీ నాయకుల నైజమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. ఆమె గురువారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ముందుగా గురజాల రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురజాల, రాయచోటి, నాగలదిన్నె, సాయంత్రం గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సంజీవపురం గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాలన్నా సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని విన్నవించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు నాగలదిన్నె గ్రామంను దత్తత తీసుకుని రూ.కోటి నిధులతో ఇంటింటికీ కుళాయిలు, గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, రూ.5 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించినట్లు గుర్తుచేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి : ఎర్రకోట జగన్

పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని పార్టీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన రోడ్ షోలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కిందని కొనియాడారు. నాయకులు బీఆర్ బసిరెడ్డి, భీమిరెడ్డి, బుట్టా నీలకంఠప్ప, లక్ష్మీకాంతరెడ్డి, శివారెడ్డిగౌడ్, విరుపాక్షిరెడ్డి, వీరస్వామి, లక్ష్మీ, బైటిగేరి శివన్న, విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

నందవరం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక నందవరం మండలంలో నిర్వహించిన రోడ్ షో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. గురువారం మండలంలోని గురజాల, రాయచోటి, నాగలదిన్నె, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, సంజీవపురం, చిన్నకొత్తిలి గ్రామాల్లో చేపట్టిన రోడ్ షోకు అడుగడుగునా జన నీరాజనం పలికారు. బ్యాండు మేళాలు, డ్రమ్స్ దరువుల మధ్య అభ్యర్థిపై మహిళలు పూలు చల్లుతూ, కార్యకర్తలు పూలమాలలతో స్వాగతం పలికారు. పలువురు శాలువాలతో సత్కరించారు. మహిళలు సైతం వైఎస్సార్‌సీపీ జెండాలు, టోపీలు, కండువాలు ధరించి రోడ్ షోలో చిందులేశారు. అభ్యర్థి బుట్టా రేణుక, ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి ప్రసంగానికి యువత, మహిళల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ యాత్ర పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపింది.



వైఎస్సార్‌సీపీ జెండాతో కార్యకర్త సంబరం

వైఎస్సార్‌సీపీలో చేరిక



బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో పలు గ్రామాలకు చెందిన ఆచార్య ప్రబోధానంద సేవాసమితి సభ్యులు ఆ పార్టీలో చేరారు. 34వ వార్డు ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రమేష్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు రవిప్రకాష్, నర్సప్ప, గజేంద్ర, గోనెగండ్ల మండలం కుర్నూరుకు చెందిన శ్రీను, చిన్న లింగన్న, రామకృష్ణ, జగదీష్, బోదెపాడుకు చెందిన రామకృష్ణ, ఒంటెడుదిన్నెకు చెందిన రాజశేఖర్, రవితో పాటు మరో 80 మంది వైఎస్సార్‌సీపీలో చేరగా ఆమె పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని రూరల్: మండలంలోని విరుపాపురం సచివాలయానికి చెందిన 9 మంది వలంటీర్లు గురువారం విధులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో వీణ, ఓంకార్, నాగరాజు, నరేంద్రబాబు, లలిత, సౌమ్య, సరస్వతి, జనార్దన్, రమేష్ ఉన్నారు.

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామానికి చెందిన వలంటీర్లు 16 మంది గురువారం విధులకు రాజీనామా చేశారు. వారి రాజీనామా పత్రాలను ఉన్నతాధికారుల దృష్టికి పంపిస్తామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కోసిగి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని దోమలు వ్యాప్తి చెందకుండా నివారించాలని తద్వారా విషజ్వరాలు ప్రబలకుండా నియంత్రించవచ్చని కోసిగి ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. గురువారం కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ఆస్పత్రిలో వైద్య సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మురుగు కాల్వలు, ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న జ్వరం వచ్చినా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్ రాముడు, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డెంటల్ డాక్టర్ కాదు.. మెంటల్ పేషెంట్

● సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి
● ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పుదాం
● ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్: బీజేపీ అభ్యర్థి పార్థసారథి గౌరవప్రదమైన డెంటల్ డాక్టర్ వృత్తిని మరిచిపోయి మెంటల్ పేషెంట్‌గా మారిపోయాడని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన గురువారం మండలంలోని మదిరె, పెద్దహరివాణం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తూ గ్రామ పురవీధులగుండా కలియ తిరిగారు. ప్రచార రథంపై నుంచి ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక డాక్టర్‌గా బీజేపీ అభ్యర్థి పార్థసారథిపై గౌరవం ఉండేదని, ఎన్నికల్లో పోటీలో నిలిచినప్పటి నుంచి ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. చెప్పుడు మాటలు వింటూ లేనిపోని ఆరోపణలు చేయడం తగదని సూచించారు. ఎక్కడి నుంచో వచ్చి ఆదోనిలో రాజకీయం చేసి పబ్బం గడపాలనుకుంటే కుదరదని, ప్రజలు తగిన శాస్తి చెబుతారని హెచ్చరించారు. కేవలం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని తిడితే ఓట్లు పడతాయని అవివేకంతో రెచ్చిపోయి మాట్లాడడం సరికాదన్నారు. పార్థసారథి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినంత మాత్రాన నేను రెచ్చిపోనని, మే 13న ప్రజలే బుద్ధి చెప్పి సాగనంపుతారన్నారు. లోకల్ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు రాసిచ్చిన స్క్రిప్టు చదువుతూ లేనిపోని ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేద కుటుంబాలకు రూ.3 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని వివరించారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశాడని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగనన్న ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించాడన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను నిరుపేదల బ్యాంకు ఖాతాలకు జమ చేశారని వివరించారు. నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల తీరు మారిపోయిందన్నారు. మార్పు అంటే ఇది కాదా అంటూ ప్రశ్నించారు. ఇన్ని చేసిన ముఖ్యమంత్రి జగనన్న మళ్లీ సీఎం కావాలా? వద్దా? అని ప్రజలను అడగ్గా కావాలి అని ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్సీ మధుసూదన్, మదిరె గ్రామ సర్పంచ్ నారాయణ, పెద్దహరివాణం సర్పంచ్ రాముడు, వైస్ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు అసెంబ్లీకి 28 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఘట్టం గురువారం ముగిసింది. ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానానికి మొత్తం 28 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. చివరి రోజున 9 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణక - 4, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి - 4, ఆయన సతీమణి బి.నిత్యాదేవి - 4, బీజేపీ నుంచి కేఆర్ మురహరిరెడ్డి -1, కాంగ్రెస్ అభ్యర్థి ఖాశింవలి - 3, బీఎస్పీ అభ్యర్థి కె.రాఘవేంద్ర - 3, ఇండిపెండెంట్ అభ్యర్థులు గువ్వల నారాయణ, విజయలక్ష్మి, రాజశేఖర్, ఈరన్న, బీఎస్పీ నుంచి బంగారప్ప, జి.ఈరన్న, జాతీయ జనసేన పార్టీ నుంచి నాగార్జునరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి క్రాంతినాయుడు, వైఎస్సార్‌సీపీ నుంచి బుట్టా శివనీలకంఠ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆర్‌ఓ వెల్లడించారు.

ఆదోని అసెంబ్లీకి మరో 9 నామినేషన్లు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి తరఫున నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికలు-2024 నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. చివరిరోజు వివిధ పార్టీల నాయకులు, స్వతంత్ర్య అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డి తరఫున మూడో సెట్ నామినేషన్ పత్రాలను ఆయన కుమారుడు మనోజ్‌కుమార్ రెడ్డి గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివనారాయణశర్మకు అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రమేష్‌యాదవ్, ఆ పార్టీకి చెందిన మరో అభ్యర్థి యువరాజ్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. స్వతంత్ర్య అభ్యర్థులు జయన్న, యువరాజ్, బి.నాగరాజు, ప్రభాత్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరఫున మహిళా అభ్యర్థి చంద్రకళ, ఎస్.ప్రకాష్‌జైన్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం 9 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో తెలిపారు.

జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి



గోనెగండ్లలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఆ పార్టీ నాయకుడు బుట్టా ప్రతుల్ కోరారు. ఆయన గురువారం గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఉదయం శ్రీరామ్ నగర్, అలాగే సాయంత్రం సంతమార్కెట్, ఎస్సీ కాలనీలలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని వివరించారు. మరింత అభివృద్ధి జరగాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ నాయకులు బందెనవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి, మురళి నాయుడు, రవి కుమార్‌నాయుడు, దొరబాబు, అల్లబండ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో సెబ్ పోలీసులు

కోసిగి: జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండల పరిధిలోని కడదొడ్డి గ్రామంలో రూట్ వాచ్ నిర్వహిస్తుండగా అక్రమ మద్యం పట్టుబడినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఉదయం గ్రామ శివారులో ఓ వ్యక్తి బైక్‌పై మద్యం తరలిస్తూ పోలీసులను గమనించి బైక్‌ను వదిలి పరారైనట్లు తెలిపారు. 6 బాక్సులలో 768 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను గుర్తించి బైక్‌తో పాటు మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరారైన నిందితుడు కడదొడ్డి గ్రామానికి చెందిన గోతులదొడ్డి దొడ్డయ్యగా గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే పెద్దకడబూరు మండలం జాలవాడి గ్రామంలో ఎమ్మిగనూరుకు చెందిన మొబైల్ పార్టీ బృందం ఎస్ఐ శివక్రిష్ణమ్మ, కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషాతో కలిసి దాడులు నిర్వహించగా వడ్డె సాయికుమార్ అనే వ్యక్తి వద్ద 36 మద్యం టెట్రా ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఆలూరు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మద్దమ్మ అన్నారు. మండల పరిధిలోని అరికెర గ్రామంలో ఓ బాలిక ఇటీవల పదో తరగతి 441 మార్కులతో పాసైంది. అయితే బాలికకు తల్లిదండ్రులు త్వరలో పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఆలూరు సీడీపీఓ మద్దమ్మ, సూపర్‌వైజర్ పద్మావతితో కలిసి గురువారం గ్రామానికి వెళ్లి తల్లిదండ్రులకు సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలని సూచించారు. వివాహ వయసు వచ్చిన తరువాత పెళ్లి చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా నేరస్తులవుతారని హెచ్చరించారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో వెలిసి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయి బాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

13 మంది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంత్రాలయం అసెంబ్లీ స్థానానికి 13 మంది అభ్యర్థులు 17 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి, టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి, జాతీయ జనసేన పార్టీ తరఫున ఆర్.రాఘవేంద్ర రెడ్డి, బహుజన సమాజ్‌వాదీ పార్టీ తరఫున సామెల్, కాంగ్రెస్ పార్టీ తరఫున పీఎస్ మురళీకృష్ణ రాజు, స్వతంత్ర అభ్యర్థులుగా వై.సీతారామిరెడ్డి, ఎస్.యశోదమ్మ, ఎస్.రామకృష్ణ రెడ్డి, ఎం.రాఘవేంద్ర రెడ్డి, పరమేష్, గుడిసె రామాంజనేయులు, కురువ నాగిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి రెండవ సెట్ నామినేషన్ వేశారు. చివరి రోజు గురువారం 7 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్వో మురళీ నేతృత్వంలో నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది.

విస్తృతంగా ఇంటింటి ప్రచారం



రాయనగర్‌లో ప్రచారం చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి



దేవీనగర్‌లో ప్రచారం చేస్తున్న హిరణ్మయి రెడ్డి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కోడలు హిరణ్మయిరెడ్డి, కుమార్తెలు గౌతమిరెడ్డి, మనోవిద్యారెడ్డి, కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి గురువారం పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. 38, 39వ వార్డు పరిధిలోని రాయనగర్, కింది కొట్టాల, పైకొట్టాల, పర్వతాపురం, దేవీనగర్ ప్రాంతాల్లో ప్రజలను కలిసి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని విన్నవించారు. ప్రతిఒక్కరినీఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ప్రచారం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో సారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, డైరెక్టర్లు రేణుక, మంజుల, కౌన్సిలర్లు వరలక్ష్మి, మహేష్, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



నదికైరవాడిలో అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

గోనెగండ్ల: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండకపోతే దోమలు వృద్ధి చెంది అనారోగ్యం కలుగజేస్తాయన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీటిలో క్రిమీ సంహారక మందు పిచికారీ చేయాలన్నారు. రాత్రి పడుకునేటప్పుడు దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వినియోగించాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రతతోనే మలేరియా నివారణ

నందవరం: పరిసరాల శుభ్రతతోనే మలేరియా వ్యాధి నివారణ సాధ్యమని పీహెచ్‌సీ డాక్టర్ పరిమళ పేర్కొన్నారు. గురువారం నదికైరవాడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్లో భాగంగా ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. డ్రైయినేజీలు, కాలువలు, నీటి కుంటలు, తొట్టెలలో యాంటీ లార్వాద్రావణం, ఇళ్లలో యాబిట్ ద్రావణం పిచికారీ చేయించారు. హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

కౌతాళం: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ అమరేశ్ స్వామి, పంపాయ్య స్వామి మరో పది కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన అమరేశ్ స్వామి, పంపాయ్యస్వామి మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పార్టీలో ఉన్న తమకు ఎలాంటి గౌరవం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్నటికీ అధికారంలోకి రాదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. సర్పంచ్ పాల్ దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు వడ్డె రాము, భీమేష్, అబ్దుల్‌సమద్, ప్రహ్లాదరెడ్డి, ఇద్రూస్, నర్సారెడ్డి, తాహెర్, పలువురు పాల్గొన్నారు.